శ్రీమహాలక్ష్మి లాంటి శ్రీవిద్య ఇంట్లో కాలుపెట్టిన వేళావిశేషమో ఏమోగానీ, కొద్దిరోజుల్లో నాకు పోలీసు ఉద్యోగం వచ్చింది. అప్పుడు నాన్నగారి ముఖంలో వెల్లివిరిసిన సంతోషాన్ని చూసి ఎంతో గర్వంగా ఫీలయ్యాను.

అయితే ఆరోజు చచ్చిపోవాలని రైలుపట్టాల మీద పడుకున్నప్పుడు దేవుడిలా వచ్చి నన్ను ఆ వ్యక్తి రక్షించబట్టే, ఈరోజు నేను నా కుటుంబ సభ్యులతో ఇంత ఆనందం అనుభవిస్తున్నాను. ఆయనే లేకుంటే ఈరోజు మా పరిస్థితి వేరేవిధంగా వుండేది. మా కుటుంబమంతా ఆ మహానుభావుడికి కృతజ్ఞులమై వుంటాం.

అందుకే పెద్దలంటారు, ఆవేశంలో వున్నప్పుడు తీసుకునే నిర్ణయాలు సరైనవి కావని. అలాంటి సమయంలో ఆగి ఆలోచించాలి. అప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతాం.

ఆనాటి నుంచి రైలుపట్టాలను చూసినప్పుడల్లా, నాకు గత జ్ఞాపకాలు గుర్తుకువస్తూనే వుంటాయి. ఇంతలో రైలు వచ్చి ఆగేసరికి నా జ్ఞాపకాలు చెదిరిపోయాయి. శ్రీవిద్య, పాపతో కలిసి రైలెక్కాను.

**- బి.సాంబమూర్తి**
**(రామలింగాపురం)**

# అభ్యర్ధన

**ప్రియమైన రవికి,**

**నువ్వు ఇంటికొచ్చి ఆర్నెల్లు దాటుతోంది. ఇటీవల నువ్వు చదువుతున్న కాలేజీకెళ్లి ఎంక్వయిరీ చెయ్యగా, నువ్వు సినిమా దర్శకుడిగా మారాలని హైదరాబాద్‌కి వెళ్లావని నీ రూమ్మేట్ సుధాకర్ ద్వారా తెలుసుకున్నాను. అతి త్వరలోనే పెద్ద సినిమా దర్శకుడినవుతానని నువ్వు శపథం చేసినట్టు కూడా చెప్పాడు. సంతోషం.**



చిన్న వయసులో నువ్వు స్కూల్లో చదివే రోజుల్లో, నోటు బుక్స్‌లో నువ్వు రాసుకునే చిన్న చిన్న కవితల్ని చూసి, నీలో అంతర్గతంగా ఓ కవి ఉదయిస్తున్నాడని అనుకునేవాణ్ణి. నువ్వు కాలేజీలో చదువుతున్నప్పుడు రాసిన కవితల్ని అచ్చులో చూసి ఆనందించేవాణ్ణి.

చివరి పరీక్షల్ని కూడా లెక్కచెయ్యకుండా రాత్రంతా కూచుని నువ్వు రాసిన నాటకం గుర్తుందా? దాన్ని చదువుతుంటే నీలో ఓ కథారచయిత అదృశ్యంగా నిద్ర లేస్తున్నాడని సంతోషించాను.

నువ్వు సంవత్సరం క్రితం రాసిన 'మార్పు' నాటకం, నిరుద్యోగ పట్టభద్రుల్లో వేళ్లూనుకున్న నిర్వీర్యతనీ, వాళ్లకి అండగా నిలిచిన ఓ యువతి, ఆమె వాళ్లలో నిద్రాణమై వున్న టాలెంట్‌ని గుర్తెరిగేలా చేసి, ఉద్యోగమొక్కటే పట్టభద్రునికి పట్టుగొమ్మ కాదని హృద్యంగా రాశావే.. అది స్టేజీ మీద ప్రదర్శిస్తుంటే చూసి పులకించిపోయాను. ఎవరైనా దానిని సినిమాగా తీస్తే, యువతరంగంలో మార్పుకు అది మార్గదర్శి అవుతుందని ఘంటాపథంగా చెప్పగలను.

మీ అక్కయ్య పెళ్లి, తమ్ముడి చదువు, మీ అమ్మ హార్టు సర్జరీ, మా అమ్మ కంటి ఆపరేషన్... వీటన్నిటికీ ఆర్థిక వనరులు నేనొక్కడినే సమకూర్చడం శ్రమతో కూడుకున్నదే. అయినా కుటుంబం అన్న తర్వాత యజమానికి ఇలాంటి సమస్యలు వుండవా? లేకపోతే అది కుటుంబం ఎలా అవుతుంది?

ఇప్పుడు నువ్వు చదువుతున్న బి.ఇ. కంప్లీట్ చేసి ఉద్యోగంలో చేరితే, మరి నీలో వున్న కళాకారుడికి అవార్డులు అందొచ్చేదెప్పుడు? నీ ప్రయత్నాలు నువ్వు చేస్తూ వుండు. నా పూర్తి సహకారం నీకుంటుంది.

* * *

ఇలా అని రాసి, నీకు అండగా వుండాలని నాకూ వుంది.

అయినా... అలా చెయ్యడానికి ఈ మధ్యతరగతి స్కూలు మాస్టారికి మనసొప్పటం లేదు మరి.

చేతికి అందొచ్చిన కొడుకుని ఎదురుగా వుంచుకుని, అన్యుల ముందు నా ఆర్థిక సమస్యల్నుంచి అర్థించలేను.

చిన్న వయసులోనే నువ్వీ నిర్ణయం తీసుకుని ఇల్లొదిలి వెళ్లుంటే, నీ ఆశయం నెరవేరేది. నీపై మేము పెంచుకున్న ఆశలు అంతరించిపోయేవి. ఆర్థికంగానూ నష్టపోయేవాళ్లం కాదు.

ఉన్న లోన్లన్నీ పెట్టి నిన్ను చదివించి, అవి చాలక నీ ఇంజనీరింగ్ చదువు కోసం బ్యాంకులో ఎడ్యుకేషన్ లోను పెట్టి, నెలనెలా వడ్డీ కడుతూ నిన్ను చదివించింది ఎందుకు? వృద్ధిలోకొచ్చి ఉద్ధరిస్తావనిగానీ, ఇలా అర్థాంతరంగా నన్ను అప్పుల ఊబిలోకి నెట్టి, నువ్వు ఊహాలోకంలో విహంగంలా ఎగిరిపోవడానికి కాదు.

అలాగని నా కష్టాల్లో నిన్ను పాలుపంచుకోమని అభ్యర్థించడం లేదు. మేజర్‌వి నువ్వు. నీ జీవితం నీ ఇష్టం వచ్చినట్టు మలచుకో. అభ్యంతరం లేదు.

కానీ నీ చదువు కోసం చేసిన అప్పులు, బ్యాంకులో తీసుకున్న ఎడ్యుకేషన్ లోను నేనే తీర్చాలంటే, పెళ్లికెదిగిన నా పెద్దకూతురికి పెళ్లి చేసి తరలించడం నాకు కష్టం.

అందుకే... ఈ ఋణగ్రస్తుణ్ణి, ఋణవిముక్తుణ్ణి చెయ్యమని అభ్యర్థిస్తున్నా... అది నీ బాధ్యత అని గుర్తుచేస్తున్నా...

ఎందుకంటే... నేను నీకు జన్మనిచ్చిన మధ్యతరగతి తండ్రిని గనక...

-ఇట్లు,
ఓ మధ్యతరగతి తండ్రి.

**- ఎం.వెంకటేశ్వరరావు**
**(సికింద్రాబాద్)**